వైద్యులు నిరసన విరమించాలి : కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, జూన్ 27 : రోగుల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్న వైద్యుల రక్షణ కోసం తగిన చర్యలు చేపడుతామని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రెండురోజుల కిందట ప్రైవేట్ దవాఖాన వైద్యులపై జరిగిన దాడిని నిరసిస్తూ ప్రైవేట్ దవాఖానల వైద్యులు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో కలెక్టర్ కలెక్టరేట్‌లో ప్రైవేట్ దవాఖాన వైద్యులతోపాటు అధికారులతో కలిసి గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా వైద్యులు, ప్రజలు సంయమనం పాటించాలన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేపట్టేందుకు కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోకుండా చట్టపరంగా చర్యలు చేపట్టేందుకు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలకు ముమ్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతామన్నారు. చికిత్స సమయంలో రోగి మృతి చెందితే వైద్యులు ప్రజలకు స్పష్టంగా కారణాలను వివరించాలని, అలా చేయడం వల్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నివారించవచ్చన్నారు. వైద్యులు తక్షణమే సమ్మెను విరమించుకొని ప్రజలకు అందుబాటులో ఉండి మంచి వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ సూచనల మేరకు ప్రైవేట్ దవాఖాన వైద్యులు సమ్మెను విరమించుకొని వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఆత్మకూరు కవికి అరుదైన పురస్కారం


బాబుదేవిదాస్‌రావు

ఆత్మకూరు, జూన్ 27 : ప్రముఖ రచయిత కవిపరమేశ్వర డాక్టర్ బాబుదేవిదాస్ రావు మరో అరుదైన పురస్కారానికి ఎంపికయ్యాడు. తెలుగు సాహిత్యంలో ఉత్తమంగా నిలిచే గ్రంథాలకు ప్రతి ఏడాది అందించే సారస్వత పరిషత్ రాష్ట్రస్థాయి పురస్కారం ఈ ఏడాది బాబు దేవిదాస్‌రావుకు దక్కింది. ఆయన రచించిన 'శ్రీ రామాయణోపనిషత్తు' గ్రంథానికి గానూ పద్య, గేయ విభాగాల్లో ఈ గౌరవ పురస్కారం లభించింది. హైదరాబాద్ విశ్వ విద్యాలయంలో అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి నేతృత్వంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలో నిర్వహించే సభలో బాబుదేవిదాస్ రావుకు ఈ పురస్కారంతో పాటు ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సాహిత్య రంగంలో బాబు దేవిదాస్‌రావు చేసిన విశేష కృషికి ఫలితంగానే ఆయనకు సారస్వత పరిషత్ విశిష్ట పురస్కారం లభించిందని ఉమ్మడి జిల్లాలోని కవులు అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఈ పురస్కారం లభించడంపై వారంతా హర్షం ప్రకటిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ దేవన్న

అయిజ, జూన్ 27 : పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ దేవన్న పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 1వ వార్డులో చైర్మన్ పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్మమ్మ ఆలయ సమీపంలో పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. శ్మశాన వాటికకు వెళ్లేదారిలోని బోరు మోటరు కాలిపోయిందని కాలనీ వాసులు చెప్పడంతో ఏఈతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

• స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్

మొక్కను నాటుతున్న స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు చీర్ల కృష్ణసాగర్

కొత్తకోట, జూన్ 27 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు చీర్ల కృష్ణసాగర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర గురువారం కొత్తకోటకు చేరుకోవడంతో కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్‌రెడ్డి వాకింగ్ సభ్యులు, అలాగే సాగర సంఘం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పలువురు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఆవరణ, పాలెం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. అలాగే పాదయాత్ర కనిమెట్ట గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు కృష్ణసాగర్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, శ్రీను, నాగన్న, యాదయ్యసాగర్, ఆంజనేయులు, గోపిస్వామి, నరేందర్‌సాగర్, వినోద్‌సాగర్, పెంటన్నయాదవ్, రాజు, మోహనాచారి, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు, గంగాధర్‌శెట్టి, రాజు పాల్గొన్నారు.

బొగ్గుగనులు సింగరేణికి అప్పజెప్పాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

పాన్‌గల్, జూన్ 27 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా గురువారం మండలకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మాట్లాడుతూ దేశంలో 500 బొగ్గు గనులు ఉండగా ఇప్పటికే 3వందలకుపైగా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు చౌకకు కట్టబెట్టారని తెలిపారు. గనుల శాఖకు చెందిన కిషన్‌రెడ్డి పదవి చేపట్టగానే తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన చేపట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భగత్, వెంకటయ్య, జంబులయ్య, నర్సింహ, మణ్యెం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు పంపిణీ

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 27 : ఎర్రవల్లి మండలం పదోపటాలంలోని సాయుధ చైతన్య విద్యార్థులకు గురువారం ఇటిక్యాల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మందులు పంపిణీ చేశారు. సాయుధ చైతన్య పాఠశాల ఇన్‌చార్జి ఆంజనేయులు, డాక్టర్ రాఘువేందర్ సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు వేసినట్లు ఏఎన్‌ఎం పరిమళ తెలిపారు. కార్యక్రమంలో ఆశ సుగుణ, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి

గట్టు, జూన్ 27 : మండలంలోని ఆలూర్ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న బుల్లెద్దుల లక్ష్మన్న (49) విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం ఉదయం 11:30గంటలకు డ్యూటీలో చేరగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఏఈ చిన్నయ్య లోడ్ ఎక్కువగా ఉందని విద్యుత్ సరఫరా త్రీ ఫేజ్ నుంచి సింగిల్ ఫేజ్‌కు మార్చాలని ఆదేశించాడు. దీంతో లక్ష్మన్న సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ట్రిప్ చేయకుండా డైరెక్ట్‌గా పెంచికలపాడు 1/3 ఏబీ స్విచ్ ఆపరేట్ చేయడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించి అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'అమ్మ ఆదర్శ' ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి

• వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్

వనపర్తి, జూన్ 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, విద్యార్థుల ఏకరూప దుస్తుల పంపిణీ పై ఇంజినీరింగ్, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 329పాఠశాలలను ఎంపిక చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు ప్రారంభించి ఇప్పటికే పనులు పూర్తయిన వాటికి మండలానికి మూడు చొప్పున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మరికొన్ని పాఠశాలల్లో పనులు కొనసాగుతున్న వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఏ పాఠశాల ఏ తేదీన పూర్తిచేసి ఇస్తారో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని ఇంజినీర్లను ఆదేశించారు. పనులు పూర్తయిన వాటిని ఎంఈవో పరిశీలించి ప్రధానోపాధ్యాయులతో కలిసి పని సంతృప్తికరంగా పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు. పనులు పూర్తయిన వాటికి అన్ని డాక్యుమెంట్లతో ఎంబీలు అందజేయాలన్నారు. పనులు ప్రారంభం చేయకముందు, పని పూర్తయ్యాక ఉన్న ఫొటోలు విధిగా జత చేయాలన్నారు. ఏకరూప దుస్తులపై సమీక్షిస్తూ విద్యార్థులందరికీ యూనిఫాంలు ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పటివరకు ఏకరూప దుస్తులు ఇచ్చినవి, ఇవ్వకుండా మిగిలి ఉన్న దుస్తుల వివరాలు ఇవ్వాల్సిందిగా డీఈవోను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్లు మల్లయ్య, రోడ్డు భవనాల శాఖ ఇంజినీర్ దేశ్యానాయక్, డీఆర్డీవో ఉమాదేవి, విద్యాశాఖ అధికారులు,డీఈలు పాల్గొన్నారు.

కొరత లేకుండా చూడాలి

జిల్లాలోని రైతులకు సేద్యం చేసేనాటికి విత్తనాలు, ఎరువులకు లోటులేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్ కలెక్టర్‌కు సమాధానం ఇస్తూ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటి నిల్వల వివరాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఏడీలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన రావుల

నివాళులర్పిస్తున్న రావుల

వనపర్తి, జూన్ 27 : నియోజకవర్గంలో పలువురు ప్రముఖులు, నాయకులను గురువారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని ప్రముఖ వైద్యులు మురళీధర్, రమేశ్‌బాబు ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స తీసుకొని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న రావుల వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. అలాగే మద్రికుంటలోని బీఆర్ఎస్ నాయకుడు శ్రీను తండ్రి చీర్లబుచ్చన్న దశదిన ఖర్మలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. రిటైర్డ్ టీచర్ సత్తార్ తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకొని బాధితుల ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సాహితీవేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ తల్లి మాజీ సర్పంచ్ అనసూయమ్మ మరణవార్త తెలుసుకొని వారి కుటుంబాన్ని ఓదార్చారు. రావుల వెంట జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రమేశ్, ఎండీ గౌస్, నర్సింహ, రాజేందర్, బాలయ్య పాల్గొన్నారు.

ఎస్టిమేషన్ తయారు చేయాలి

కొత్తకోట, జూన్ 27 : రాజీవ్ భీమాఫేజ్–2 కెనాల్ లిఫ్టు మోటార్ల మరమ్మతుల కోసం ఎస్టిమేషన్ తయారు చేయాలని కోరుతూ గురువారం కనిమెట్ట గ్రామానికి చెందిన రైతులు ఈఈ కార్యాలయంలో డీఈ ఎల్లస్వామిని కలిశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరులోని భీమా నీటిపారుదల కార్యాలయంలో మోటార్ల మరమ్మతు కోసం ఎస్టిమేషన్ తయారు చేయాలని డీఈని రైతులు కోటేశ్వర్‌రెడ్డి, యాదగిరి, ఆకుల శ్రీనివాసులు, రమేశ్, రామకృష్ణ, బాలరాజులు కలిశారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆత్మకూరు, జూన్ 27 : నేడు జరగాల్సిన ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీవో సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఇప్పటికే పలు శాఖల అధికారులు, ప్రాదేశిక సభ్యులకు సమాచారమిచ్చినా ఎమ్మెల్యే సూచనల మేరకు వాయిదా వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆమె అన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

వనపర్తి, జూన్ 27 : మండలంలోని కీర్యతండాలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీలను ఎంపీవో సుదర్శన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తున్న విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను చేర్పించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

నర్సరీ పరిశీలన

వనపర్తి, జూన్ 27 : మండలంలోని పెద్దగూడెం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని ఎంపీడీవో రాఘువ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కలను సిద్ధం చేయాలని, దీనికి సంబంధించి స్థలాలను గుర్తించి గుంతలు తీసి ఉంచుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని డ్రైనేజీలను శుభ్రం చేయాలని కార్యదర్శికి సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, జూన్ 27 : మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన కొంకలి శేఖర్ (30) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అందజేసిన రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు చంద్రయ్య, పెంటారావు, మధుకర్, నాగరాజు ఉన్నారు.

యువతి అదృశ్యం

ఉండవెల్లి, జూన్ 27 : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ వీరన్న తెలిపిన కథనం మేరకు మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన అక్బర్‌బీ కూతురు మౌలాబీ అలియాస్ మౌనిక అలంపూర్ చౌరస్తాలో డిగ్రీ కాలేజి ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గురువారం అక్బర్‌బీ వ్యవసాయ కూలీ పనులకు వెళ్లడంతో మధ్యాహ్నం కూతురు మౌలాబీ ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. సాయత్రమైన ఇంటికి రాలేద్దు. ఎక్కడ వెతికిన కనిపించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్య, వైద్యంపై నిర్లక్ష్యం చేయకూడదు

• రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

రేవల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ పాఠశాలను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జూన్ 27 : రేవల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ సేనాపతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరై వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు అభివృద్ధి పనుల నివేదికను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యంపై నిర్లక్ష్యం చేయకూడదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. మహిళా సంఘాల కోసం ఏర్పాటు చేసిన భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ పాఠశాల, నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ పాఠశాల భవనాన్ని సందర్శించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతన భవనంలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి, విద్యార్థు లు చదువుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఆయన డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎంపీటీసీలకు పదవీకాలం ముగియనుండటంతో వారిని శాలువా, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోర్ల భీమయ్య, వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రఘుయాదవ్, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఖాజా, తాసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో శంకర్, ఏవో అనిల్ కుమార్ ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు చిన్న కురుమత్‌రెడ్డి, మల్లమ్మ, శ్రీశైలం, అంజనమ్మ ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

పెబ్బేరు, జూన్ 27: అందరి సహకారంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం రాత్రి శ్రీరంగాపురంలో మహిళా సమాఖ్య, అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకు ముందు ఆయన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ రక్షితా మూర్తి

వనపర్తి టౌన్, జూన్ 27 : సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రక్షితా మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో సైబర్ పరిశుభ్రత పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసేవారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మరాదని, తెలియని మెస్సేజ్ లపై క్లిక్ చేయొద్దని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల మాయమాటలు చెప్పి బహుమతులు వచ్చాయని , ల్యాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఇతరత్రా ఆశ చూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని అలాంటి వ్యక్తులు, మెస్సేజ్‌లకు స్పందించరాదని చెప్పారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న వారు తక్షణమే 1930, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 24గంటలలోపు ఈ నెంబర్లను ఫిర్యాదు చేస్తే వెనక్కి డబ్బులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, ఇన్‌స్పెక్టర్ శ్రీను ఉన్నారు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 27 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పేద విద్యార్థులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్ హౌస్ ఎదుట స్టూడెంట్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలియజేసినందుకు గానూ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్, మాజీ విద్యార్థి సంఘం నాయకులను మొత్తం ఐదుగురిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తూ మరో ఐదు మంది విద్యారులకు రూ.10వేల ఫైన్ వేస్తున్నట్టుగా యూనివర్సిటీ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులపై పోలీస్ కేసులు పెట్టడమే కాకుండా విద్యార్థులను యూనివర్సిటీ నుంచి వెలివేస్తూ సస్పెన్షన్ విధించిందన్నారు. తక్షణమే విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యవాదులందరూ దీనిని ఖండించి జరుగబోయే ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి, కమిటీ సభ్యులు భరత్, సాయి, కుమార్, స్వాములు, వెంకటేశ్, మహేశ్ ఉన్నారు.

శ్రీరంగాపురం అభివృద్ధికి కృషి చేశా

• సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గాయత్రి

సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గాయత్రి

పెబ్బేరు, జూన్ 27 : శ్రీరంగాపురం మండల అభివృద్ధికి తన వంతుగా ఎంతో కృషి చేశానని ఎంపీపీ గాయత్రి అన్నారు. గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్త మండలంగా ఏర్పాటయ్యాక తొలి ఎంపీపీగా తాను ఆశించిన పనులు పూర్తి చేయగలిగానన్నారు. తనతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ఇదే చివరి సమావేశమని, తమ పదవులు త్వరలోనే ముగుస్తాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీరంగాపురం మండలంగా ఏర్పాటు కావడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులకు అంకురార్పణ జరిగి, ప్రగతికి బాటలు పడ్డాయని ఆమె చెప్పారు. తర్వాత ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు ఇదే ఒరవడి కొనసాగించి, శ్రీరంగాపురానికి మంచి పేరు తేవాలని గాయత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో రవీందర్, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పీహెచ్‌సీ అదనపు భవనం

అయిజ, జూన్ 27 : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సంఖ్య పెరుగుతుండటంతో దాదాపు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ అదనపు భవనం మందుబాబులకు అడ్డాగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో భవన నిర్మాణం చేపట్టినా పనులు పూర్తికాక పోవడంతో భవనం నిరుపయోగంగా మారడంతో మందు బాబులు జల్సాలకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పీహెచ్‌సీ అదనపు భవనాన్ని ఆయన పరిశీలించారు. రాత్రి వేళల్లో పీహెచ్‌సీకి రక్షణ లేకపోవడంతో మందు బాబులు నూతన భవనంలోకి చేరి రోగులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో విద్యుత్ దీపాలు లేకపోవడం, ముళ్ల పొదలు పెరగడంతో అల్లరి మూకలు, మందు బాబులకు పీహెచ్‌సీ నిలయంగా మారిందన్నారు. రాత్రి వేళల్లో రోగులకు పీహెచ్‌సీకి వెళ్లే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుత పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉన్నతాధికారులు భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి, రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహయ్యశెట్టి, ప్రదీప్‌కుమార్, గోపాలకృష్ణ, భగత్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, వీరయ్యాచారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ

భరోసా నూతన భవనం పరిశీలన

గద్వాల అర్బన్, జూన్ 27 : జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీలో నూతనంగా నిర్మించిన భరోసా భవనాన్ని గురువారం ఎస్పీ తోట శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ గుణశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రూ.2 కోట్లతో నిర్మించిన భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని భరోసా ఇన్‌చార్జి ఎస్సై అరుణకు సూచించారు. కార్యక్రమంలో సీఐ భీంకుమార్, భరోసా కో ఆర్డినేటర్ శివాని తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

వనపర్తి, జూన్ 27 : జిల్లాలో ఆయిల్ పాం తోటల సాగును ప్రోత్సహించేందుకు ఈ ఏడాదికి 2,800 ఎకరాలలో ఆయిల్ పాం తోటల పెంపు లక్ష్యంగా జిల్లా ఉద్యానశాఖ కృషి చేస్తుందని, ఆస్తకి గల రైతులు తోటల పెంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పాం తోటలతోపాటు జిల్లాలో ఇతర తోటలు కూరగాయల సాగును పెంచే నిమిత్తం 1,299 ఎకరాలకు బిందు సేద్య పరికరాలు, 405 ఎకరాలకు తుంపర సేద్య పరికరాలు రైతులకు సబ్సిడీపై అందజేస్తారన్నారు. డ్రిప్ పరికరాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, 5 ఎకరాలలోపు సాగు ఉన్న సన్న, చిన్న రైతులకు 90శాతం, మిగిలిన పెద్ద రైతులకు 80శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందజేస్తారని తెలిపారు. జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని, అదేవిధంగా అన్ని తరగతుల రైతులకు 75 శాతం పోను రైతు వాటాగా రూ.7,483లను DHSCO,WANAPARTHY పేరు మీద డీడీ రూపంలో చెల్లించాలన్నారు. ఆస్తకి గల రైతులు మీసేవలో ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నెంబర్ ద్వారా దరఖాస్తులను సంబంధిత ఉద్యాన అధికారికి అందజేయాలి. ఆయిల్ పాం తోటల సాగుకు సరిపడా మొక్కలను ఇప్పటికే యూనిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామంలోని నర్సరీలో సిద్ధంగా ఉన్నాయని త్వరలో రైతులకు సరఫరా చేస్తారని తెలిపారు. మొక్క రాయితీ పోగా రైతు వాటాగా మొక్కకు రూ.20లు DHSCO,WANAPARTHY పేరు మీద డీడీ రూపంలో చెల్లించి మొక్కలు పొందాలని సూచించారు. వివరాలకు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆత్మకూరు. జూన్ 27 : ఆత్మకూరు డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ నోటిఫికేషన్ జారీచేశారు. తెలుగు 1, కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్ 1, జంతుశాస్త్రం 1, గణితశాస్త్రం 1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులు కల్గిన వారు అర్హులుగా చెప్పారు. అదేవిధంగా పీహెచ్‌డీ పూర్తయిన వారికి మొదటి ప్రాధాన్యం, నెట్, సెట్ అర్హత కల్గిన వారికి రెండో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. బోధనానుభవము పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అదనపు అర్హతలు లేనప్పుడు పీజీలో మార్కుల శాతాన్ని పరిగణలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. అర్హత కల్గిన వారిని ఇంటర్వ్యూ, డెమో క్లాస్ ద్వారా సెలెక్ట్ చేస్తామని వివరించారు. ఈ నోటిఫికేషన్ 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించినదిగా స్పష్టంచేశారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 2న మధ్యాహ్నం 3:30 గంటల వరకు కళాశాలలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

మదనాపురం, జూన్ 27 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5నుంచి 9వతరగతి వరకు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మదనాపురం గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం రూ.100 చెల్లించి (https://tgswadtr.cgg.gov.in) ద్వారా గురువారం నుంచి జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాఠశాల బదిలీ కోసం రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలటౌన్, జూన్ 27 : ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. తెలుగు ఒకటి, ఇంగ్లిష్ ఒకటి, కామర్స్ రెండు, జువాలజీ ఒకటి, పొలిటికల్ సైన్స్ ఒకటి, కంప్యూటర్ సైన్స్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకు పీహెచ్‌డీ, నెట్ సెలక్ట్ అయ్యి ఉండి పీజీలో 55శాతం మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు మూడో తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకా వాల్సి ఉంటుందని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు

మల్దకల్, జూన్ 27 : మల్దకల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల రెండో బ్యాచ్ వారికి శిక్షణ తరగతులు గురువారం మండలకేంద్రంలో రైతు వేదిక భవనంలో సీడీపీవో కమలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మూడురోజులపాటు జరిగే శిక్షణలో టీచర్లకు నృత్యాలు, సృజనాత్మక కార్యక్రమాలు, గ్రూప్ డిస్కసన్, ప్రకృతి సందర్శన నిర్వహణ, పూర్వ గణిత భావాలను నేర్పించే విధానాలు, ఈసీసీఈడే ప్రాముఖ్యత, నిర్వహణ, బాలమేళా నిర్వహణ వంటి సరళీకరించిన పూర్వ ప్రాథమిక విద్య పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి, యామిని, వాసంతి, తెల్లమ్మ, శశికళతో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

అయిజ, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని జీహెచ్‌ఎం తిమ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేడికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోట్ పుస్తకాలను జీహెచ్‌ఎం అందజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందజేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్న తిమ్మప్ప, రామానాయుడు, నర్సింహులు పాల్గొన్నారు.